


సాలూరు: పూజల్లో పాల్గొన్న విద్యార్థులు

సరస్వతీ నమస్తుభ్యం



ప్రత్యేక అలంకరణలో కోటదుర్గమ్మ

పాలకొండ, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పాలకొండ కోటదుర్గమ్మ సన్నిధిలో మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీ పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో ప్రధాన అర్చకుడు లక్ష్మీప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసాలు, కుంకుమ పూజలు చేశారు. మహిళలు ఘటాలతో అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

సాలూరు గ్రామీణం, మక్కువ, న్యూస్‌టుడే: సాలూరులోని పంచముఖేశ్వర ఆలయంలో సరస్వతీదేవికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. 600 మంది విద్యార్థులు సరస్వతీ పూజలో పాల్గొన్నారు.

ఏనుగులను కవ్వించొద్దు

పార్వతీపురం గ్రామీణం/సీతానగరం, న్యూస్‌టుడే: పార్వతీపురం అటవీ శాఖ పరిధిలో ఏనుగులు సంచరించే ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని డీఎఫ్‌వో జీఏపీ ప్రసూన కోరారు. బుధవారం మండలంలోని పులిగుమ్మి, సీతానగరం మండలం గుచ్చిమి ప్రాంతాల్లో గజరాజులు తిరుగుతున్న ప్రాంతాలను ఆమె పరిశీలించారు. గుచ్చిమి కొండను అనుసరించి ఉన్న మామిడితోటల్లోనే మూడు రోజులుగా ఏడు ఏనుగుల గుంపు సంచరిస్తూ.. గుచ్చిమి, తాన్న సీతారాంపురం, సూరంపేట గ్రామ పరిసరాల్లో బస చేస్తున్నాయని చెప్పారు. అవి గ్రామాల వైపు వెళ్లకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వాటి వల్ల జరిగే నష్టాలకు స్థానిక వీఆర్వోలతో కలిసి వెంటనే అంచనాలు వేయాలని ఏనుగుల పర్యవేక్షణ రేంజర్ మణికంఠేష్, ఫారెస్టర్ మనోజ్‌లను ఆదేశించారు. కుంకీ ఏనుగుల సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేసే ప్రాంతాల్లో త్వరలో పనులు మొదలవుతాయన్నారు. గ్రామ పరిసరాల్లోకి ఏనుగులు వస్తే వాటిని కవ్వించకుండా.. తమ సిబ్బందికి సమాచారం అందించాలని స్థానికులను కోరారు. సాయంత్రం 6 నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు ఒంటరిగా తిరగవద్దని సూచించారు.

మలేరియా, డెంగీలపై అప్రమత్తం

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లాలో మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా వైద్య, ఆరోగ్య శాఖ యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. బుధవారం వైద్య, ఆరోగ్య శాఖ పనితీరుపై కలెక్టరు సమీక్ష సమావేశం నిర్వహించారు. రక్తహీనత రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు బాలికలు, యువతులకు రక్త పరీక్షలు నిర్వహించి, వారికి సరైన పోషకాహారం అందేలా చూడాలని సూచించారు. గర్భిణులకు వైద్య పరీక్షలు ఎప్పటికప్పుడు చేసి వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపించాలని, మాతాశిశు మరణాలు జిల్లాలో నమోదు కాకుండా క్షేత్రస్థాయి నుంచే కట్టుదిట్టంగా పనిచేయాలని ఆదేశించారు. సికిల్‌సెల్ ఎనీమియా బాధితులకు ఆరోగ్య కార్డుల పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసూతి సేవల పరిశీలనకు కమిటీని వేసి, పర్యవేక్షణ పెంచాలని చెప్పారు.



విజయనగరంలో ఫుల్‌గా..

దరఖాస్తుల్లో నెల్లిమర్ల నియోజక వర్గం ప్రథమం

ఈనాడు, పార్వతీపురం మన్యం

ఉమ్మడి జిల్లాలో మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు వ్యాపారుల్లో పోటీ పెరిగింది. విజయనగరంలో బుధవారం సాయంత్రం 6 గంటల వరకు 153 దుకాణాలకు అత్యధికంగా 3,448 దరఖాస్తులు దాఖలయ్యాయి. ప్రభుత్వం మరో రెండు రోజులు గడువు పెంచడంతో మరింత పెరిగే అవకాశం ఉంది.

విజయనగరం జిల్లాలో నెల్లిమర్ల నగర పంచాయతీ సహా నియోజకవర్గం దరఖాస్తుల దాఖలులో ముందంజలో ఉంది. నగర పంచాయతీ పరిధిలోని ఒక దుకాణానికి 41, రెండో దానికి 53 రావడంతో రికార్డు నెలకొంది. నెల్లిమర్ల మండలంలోని నాలుగు దుకాణాలకు 104 దాఖలయ్యాయి. పురపాలక సంఘాల పరిధిలో పరిశీలిస్తే బొబ్బిలిలో ఏడు దుకాణాలకు 113 దరఖాస్తులు వచ్చాయి. ఇదే మండల పరిధిలో నాలుగింటికి 47 దాఖలయ్యాయి. విజయనగరం నగర పాలక సంస్థ పరిధిలో 13 దుకాణాలకు 364 దరఖాస్తులు, గ్రామీణంలో మూడింటికి 101 అందాయి. రాజాం నగర పంచాయతీలో ఏడు దుకాణాలకు 151 దరఖాస్తులు అందాయి.



పార్వతీపురం ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తుల ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

సాలూరులోనే.. అత్యధికం

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: మన్యం జిల్లాలోని అయిదు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో బుధవారం రాత్రికి 52 దుకాణాలకు మొత్తం 906 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా సాలూరు స్టేషన్ పరిధిలో ఉన్నాయి. తక్కువ సంఖ్యలో పార్వతీపురం నిలిచింది. సాలూరు 238, పాలకొండ 217, సీతానగరం 173, కురుపాం 141, పార్వతీపురంలో 137 దరఖాస్తులు వచ్చినట్లు ఏఈఎస్ జీవన్ కిశోర్ తెలిపారు. ఇంకా రెండు రోజులు గడువుందని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పారదర్శకంగా లాటరీ తీస్తామని చెప్పారు.

చీపురుపల్లిలో సిండికేటు?

చీపురుపల్లి నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి మండలాల్లో అతి తక్కువ దరఖాస్తులు దాఖలయ్యాయి. ఇక్కడ సిండికేట్ల ప్రభావం కనిపిస్తోంది. ఫలితంగా చీపురుపల్లి మండలంలో ఏడింటికి 133, గరివిడి మండలంలో అయిదింటికి 48, గుర్ల మండలంలో నాలుగింటికి 129, మెరకముడిదాం మండలంలో నాలుగింటికి 77 దరఖాస్తులు దాఖలయ్యాయి. నియోజకవర్గ కేంద్రం చీపురుపల్లి, పారిశ్రామిక ప్రాంతం గరివిడి కన్నా మిగిలిన రెండు గ్రామీణ మండలాల్లో అధికంగా రావడం గమనార్హం.

వెబ్‌సైట్‌లో వివరాలు

పార్వతీపురం మన్యం జిల్లాలో నోటిఫై చేసిన దుకాణాలు షెడ్యూల్ ఏరియాలో ఏర్పాటు చేస్తే గిరిజనులకు మాత్రమే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందని ఎక్సైజ్ శాఖ ఉప కమిషనర్ బాబ్జీరావు తెలిపారు. దరఖాస్తుదారులు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలన్నారు. షెడ్యూల్ ఏరియాలో దుకాణం నిర్వహణకు గ్రామసభ తీర్మానం తప్పనిసరి అన్నారు. దేనికి ఎన్ని దరఖాస్తులు దాఖలయ్యాయో ఎవరైనా తెలుసుకునే వెసులుబాటు కల్పించామన్నారు. ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో ఆ వివరాలు తెలుసుకోవచ్చన్నారు. మహిళలు వేసిన దరఖాస్తులపై ప్రశ్నించగా.. గతంలో ఒక్కొక్కరు ఒకటి మాత్రమే దాఖలు చేసుకునే అవకాశం ఉందని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చన్నారు. ఉభయ జిల్లాల్లోనూ ఎక్కడా ఎలాంటి అవాంతరాలు లేవని, స్వేచ్ఛగా దరఖాస్తులు చేసుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వం మరో రెండు రోజులు గడువు పొడిగించినందున వాటి సంఖ్య పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

మన్యంలో 906

పార్వతీపురం మన్యం జిల్లాలో విజయనగరం జిల్లాతో పోల్చితే కాస్త వెనకంజలో ఉంది. విజయనగరంలో 153 దుకాణాలకు 3,448 దరఖాస్తులతో సగటున ఒక్కో దానికి 22.5 నమోదయ్యాయి. మన్యంలో 52 దుకాణాలకు 906 దరఖాస్తులతో సగటున ఒక్కో దానికి 17.4 దాఖలయ్యాయి. మన్యంలో సీతానగరం, సాలూరు మండలాల్లో జోరుగా ఉండగా.. పార్వతీపురం, కురుపాం మండలాల్లో తక్కువగా కనిపిస్తోంది. రెండు జిల్లాల్లో సగటు దరఖాస్తులు 30 శాతానికి తీసుకెళ్లేందుకు ఎక్సైజ్ అధికార యంత్రాంగం కృషి చేస్తోంది.

పాపం.. దృష్టి లోపం

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

అన్ని అవయవాల్లోకి నేత్రాలు అత్యంత ప్రధానమైనవి. చిన్న వయసులోనే చాలామందికి దృష్టి లోపంతో కంటి చూపు మందగిస్తోంది. అది వారి జీవన ప్రయాణంపై ప్రభావం చూపుతోంది. గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా మన్యంలో పరిస్థితులపై ప్రత్యేక కథనం.

నేడు ప్రపంచ దృష్టి దినోత్సవం

మన్యం జిల్లాలోని ఆసుపత్రులు, అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఈ ఏడాది కాలంలో వివిధ కంటి రుగ్మతలతో బాధపడుతున్న 7,085 మందికి పరీక్షలు చేసి అందులో 3,060 మందికి శస్త్రచికిత్సలు, 480 మందికి చికిత్స చేశారు. ప్రధానంగా అంతర కుసుమాలు, టెరిజియం, నీటి కాసుల కేసులు ఎక్కువగా వస్తున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.


ఎక్కువగా 40 ఏళ్లు పైబడిన వారిలో కంటి చూపు మందగిస్తోంది. ప్రస్తుతం బడిలో చదివే పిల్లలకు నేత్ర పరీక్షలు చేస్తున్నారు. 1.20 లక్షల మంది వరకు ఉండగా.. ఇప్పటి వరకు 50 వేల మందికి పరీక్షలు నిర్వహించి.. 1,100 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. వీరికి ప్రభుత్వం కళ్లద్దాలు అందించనుంది. పది మందికి శస్త్రచికిత్సలు అవసరం.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణులు

ఇవి ఎక్కువ

నీటి కాసులు (గ్లకోమా): జిల్లాలో గ్లకోమా కేసులు ఎక్కువగా బయటపడుతున్నాయి. ప్రారంభ దశలో లక్షణాలు కనిపించకపోయినా క్రమేపీ చూపు మందగిస్తుంది. సకాలంలో దీన్ని గుర్తించకపోతే శాశ్వతంగా కంటిచూపు కోల్పోయే ప్రమాదముంది. వంశపారంపర్యంగా, మధుమేహం, రక్తపోటు ఉన్నవారికి, దీర్ఘకాలంగా స్టెరాయిడ్స్ వాడేవారికి, ప్రమాదాల్లో కంటికి గాయాలైనప్పుడు ఇది వచ్చే అవకాశం ఎక్కువ.




ఈ జాగ్రత్తలు అవసరం

ఎండలోకి వెళ్లేవారు కళ్లద్దాలు ధరించాలి. కంటి నుంచి నీరు కారడం, దురద, మంట వంటి ఇబ్బందులు ఎదురైతే వైద్యులను సంప్రదించాలి. పోషకాహారం తీసుకోవాలి. ఏ-విటమిన్ ఎక్కువగా ఉన్న ఆహారం పిల్లలకు పెట్టాలి. పిల్లలు చదివేటప్పుడు, బోర్డు వైపు చూసేటప్పుడు ఎటువంటి ఇబ్బంది పడుతున్నారో గుర్తించి వైద్య నిపుణులను సంప్రదించాలి. - **సుకుమార్, జిల్లా అంధత్వ నివారణాధికారి, నగేష్‌రెడ్డి, అంధత్వ నివారణ సంస్థ జిల్లా అధికారి**

కారణాలు ఎన్నో..

దైనందిన జీవితంలో చరవాణి వినియోగం ఎక్కువైంది. దీని ప్రభావంతో చిన్న, పెద్ద అనే తేడా లేకుండా చాలా మంది దృష్టి సంబంధ ఇబ్బందులకు గురవుతున్నారు. కంప్యూటర్ల వద్ద గంటల తరబడి పనిచేయడం వల్ల నేత్ర సమస్యలు ఎదుర్కొంటున్న వారు వేలలో ఉన్నారు. పోషకాహారం తీసుకోకపోవడం, ఏ-విటమిన్ లోపం, బయట తిరిగేటప్పుడు దుమ్ము, ధూళి కణాలు కంటిలో పడటం, అధిక ఎండల వల్ల కళ్లు పొడిబారిపోవడం వంటివి కంటి సమస్యలకు కారణాలవుతున్నాయి.



మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దండి



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, న్యూస్‌టుడే: మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని, అందుకు అవసరమైన చర్యలు క్షేత్రస్థాయిలో ప్రారంభం కావాలని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల్లో జరుగుతున్న కార్యకలాపాలపై సమీక్షించారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద జీవనోపాధులు కల్పించేందుకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళల భాగస్వామ్యంతో కొత్త యూనిట్లను స్థాపించి, వారిని పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ప్రోత్సహించాలని చెప్పారు. తక్కువ పెట్టుబడితో ప్రారంభించే వ్యాపారాలను పరిచయం చేసి, ఎక్కువ లాభాలు పొందేలా మెలకువలు నేర్పించాలన్నారు. ఐటీడీఏల్లో జీవనోపాధుల సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పీఎం విశ్వకర్మ పథకం కింద శిక్షణతో పాటు రూ.15 వేలు శిక్షణ కాలభృతి ఇచ్చి పరికరాలు అందజేస్తున్నారని తెలిపారు. ప్రతి మండలానికి ఒక ఆదర్శ వన్‌ధన్ వికాస కేంద్రాన్ని నవంబరు 1 నాటికి ఏర్పాటు చేయాలన్నారు. ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ, సీతంపేట ఏపీవో చినబాబు పాల్గొన్నారు.



భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం: ఎంపీ


చరవాణిలో సమస్యలు తెలుసుకుంటున్న కలిశెట్టి

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: పైడితల్లి సిరిమానోత్సవానికి వచ్చే సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పేర్కొన్నారు. బుధవారం విజయనగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన డయల్ యువర్ ఎంపీ కార్యక్రమంలో భాగంగా పలువురు సమస్యలు, సూచనలు, సలహాలు చెప్పగా.. వారితో మాట్లాడారు. 30 మంది సంప్రదించారని చెప్పారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టరు అంబేడ్కర్, స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. నగరపాలిక సహాయ కమిషనర్ తిరుమలరావు, పైడితల్లి దేవస్థానం ఈవో డీవీవీ.ప్రసాదరావు, తహసీల్దారు కూర్మనాథరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల సూచనలివీ..

★ ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని ★ సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు బారికేడ్లలోకి ఎక్కువ మందిని అనుమతించాలి ★ దర్శనానికి వచ్చే వారికి తాగునీరు, మజ్జిగా అందుబాటులో ఉంచాలి ★ ఇష్టానుసారంగా ఫ్లెక్సీల ఏర్పాటు, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి ★ బయో మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలి ★ ముఖ్య కూడళ్లల్లో డిజిటల్ స్క్రీన్లు పెట్టాలి ★ వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక దర్శనం కల్పించాలి

ఖండాంతరాలు దాటిన కళా నైపుణ్యం!

చిత్రలేఖనానికి జీవం పోసేలా శిక్షణ



వారు కుంచె కదిపితే అద్భుత కళారూపాలు సాక్షాత్కరిస్తున్నాయి.. బొమ్మలు అద్దితే వస్తువులకు కొత్తవన్నెలు వస్తున్నాయి.. సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిఫలిస్తున్నాయి.. ప్రతిభకు సృజనాత్మకతను జోడిస్తూ.. అంతరించిపోతున్న ఆదివాసీ చిత్రకళకు జీవం పోస్తున్నారు గిరిజన యువత. న్యూహోప్ ఫౌండేషన్ మన్యంలోని యువతలో నైపుణ్యాన్ని ప్రోత్సహిస్తూ.. గిరిజన సంస్కృతి చాటిచెప్పేలా చిత్రలేఖనంలో తర్ఫీదు ఇస్తోంది. కళాఖండాలు తీర్చిదిద్దించి వారి ప్రతిభ ఖండాంతరాలు దాటించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

– న్యూస్‌టుడే, సీతంపేట


శిక్షణ పొందుతున్న గిరిజన అభ్యర్థులు


ఆన్‌లైన్‌లో మార్కెటింగ్..

దేశ, విదేశాల్లో ఈ ఆదివాసీ చిత్ర లేఖనాలకు డిమాండు ఏర్పడింది. దీంతో లేపాక్షి హ్యాండీ క్రాఫ్ట్స్ సర్వీస్ సెంటర్(విజయవాడ) ద్వారా ఆన్‌లైన్‌లో మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నారు. ప్రభుత్వం ప్రోత్సహించాలని కళాకారులు కోరుతున్నారు.

ఆకట్టుకునేలా..


బెంచీ, ఇతర చోట్ల వేసిన ఆదివాసీ చిత్రాలు

లేపాక్షి హ్యాండీ క్రాఫ్ట్స్(ఆంధ్రప్రదేశ్ హస్తకళ అభివృద్ధి సంస్థ) ఆధ్వర్యంలో సీతంపేటలో ఆదివాసీ గిరిజన యువతకు డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్, చిత్రలేఖనంపై రెండు నెలల పాటు ఇటీవల శిక్షణ ఇచ్చారు. మారుమూల గిరిజన గ్రామాలకు చెందిన యువతకు చిత్రలేఖనంలో మెలకువలు నేర్పారు. మార్కెట్లో ఆదివాసీ చిత్రాలకు ఉన్న గిరాకీని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేకంగా తీర్చిదిద్దేలా తర్ఫీదునిచ్చారు. ఇప్పటి వరకూ గోడలకే పరిమితమైన ఈ ఆదివాసీ చిత్రాలను దుస్తులు, ఇంట్లో అలంకరణ సామగ్రి, బెంచీలు, బ్యాగులు, టీ కప్పులు, హాట్‌బాక్సులు, పెన్, చరవాణుల స్టాండులు, డైరీ తదితరాలపై వేయిస్తున్నారు. సుమారు 100 వరకు కొత్త వస్తువులపై మూడు నమూనా చిత్రాలను తీర్చిదిద్దారు.


గిరిజన సంప్రదాయం ఉట్టిపడేలా







బొమ్మలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ప్రోత్సహించేందుకు..

యువతను ప్రోత్సహించేందుకు బెన్హర్ ఆధ్వర్యంలో 'న్యూ హోప్ ఫౌండేషన్'తో పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. అంతరించిపోతున్న ఈ కళకు పునరుజ్జీవం తీసుకొచ్చేందుకు హ్యాండీక్రాఫ్ట్, పెడ్, లేపాక్షి సంస్థల సహకారంతో కళాఖండాలు రూపొందించడంలో శిక్షణ ఇచ్చాం. గౌరీష్ తర్ఫీదునిస్తున్నారు. కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ రెండు సార్లు ఈ శిబిరాన్ని సందర్శించారు. పౌష్టికాహారం పంపిణీ, ఎంబ్రాయిడరీ శిక్షణ, ఇతరత్రా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– అనిల్ కుమార్, న్యూ హోప్ ఫౌండేషన్ ప్రతినిధి, హ్యాండీక్రాఫ్ట్ సర్వీస్ సెంటర్ రిసోర్సు పర్సన్

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

నేరవార్తా విభాగం, పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: సైబర్ మోసానికి గురైతే బాధితులు 1930కు ఫిర్యాదు చేయాలని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టీ సూచించారు. బుధవారం విశాఖపట్నంలోని తన కార్యాలయం నుంచి అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎస్పీలతో జూమ్ సమావేశం నిర్వహించారు. గతంలో నమోదైన సైబర్ కేసులకు సంబంధించి బ్యాంకు ఖాతాల్లో సీజ్ అయిన నగదును బాధితులకు అందించాలని ఆదేశించారు. అత్యాచార, వరకట్న మరణాలు, పోక్సో కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలన్నారు. గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు. దీపావళి వస్తున్న నేపథ్యంలో బాణసంచా విక్రయించే దుకాణాలు, గోదాములను తనిఖీ చేసి, లైసెన్సులను పరిశీలించారు.

లక్ష్యాల్లో వెనుకబడితే చర్యలు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: గృహనిర్మాణ లక్ష్యాల సాధనలో వెనుకబడిన సహాయక ఇంజినీర్లపై చర్యలు తప్పవని కలెక్టర్ అంబేడ్కర్ హెచ్చరించారు. తన ఛాంబర్లో బుధవారం వంద రోజుల లక్ష్యాలపై గృహనిర్మాణ శాఖాధికారులతో సమీక్షించారు. కేవలం ఆరు శాతం మాత్రమే ప్రగతి ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బీబీఎల్ స్థాయిలో ఉన్న ఇళ్లను ఈ నెలాఖరు నాటికి బీఎల్ స్థాయికి తీసుకురావాలన్నారు. 16వ తేదీ నుంచి రోజువారీ ప్రగతి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. పీడీ కూర్మినాయుడు, ఈఈ శ్రీనివాసరావు, డీఈఈలు పాల్గొన్నారు.

ఒక్క అవకాశమిస్తే రాష్ట్రాన్నే ముంచేశారు



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని, వారి మధ్య భేదాభిప్రాయాలు సృష్టించేలా వైకాపా నాయకులు ప్రయత్నిస్తున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మండిపడ్డారు. పరిపాలన అంతా సచివాలయాల ద్వారానే జరుగుతుంటే.. నిర్వీర్యం చేస్తున్నామని జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. అశోక్‌బంగ్లాలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒక్కసారి అవకాశమిస్తే రాష్ట్రాన్నే ముంచేశారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో తన మార్కు చూపించారని తెదేపా విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. నాయకులు శ్రీధర్, కొండపల్లి భాస్కరరావు, ప్రసాదుల వరప్రసాద్, ఆల్తి బంగారుబాబు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	230	240

ఉత్సవాలకు రూ.3 లక్షల విరాళం


కలెక్టర్‌కు చెక్కు ఇస్తున్న బస్సుల యజమానులు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: విజయనగరం ఉత్సవాల నిర్వహణకు జిల్లా ప్రైవేటు బస్సు యజమానుల సంఘం ప్రతినిధులు భారీ విరాళాన్ని అందించారు. బుధవారం రూ.3 లక్షల చెక్కును కలెక్టర్ అంబేడ్కర్‌కు అందజేశారు. రవాణాశాఖ అధికారులు మురళీకృష్ణ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు.. విజయవాడ వరద బాధితుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి గోవింద జ్యూయలర్స్ సంస్థ అందజేసిన రూ.లక్ష చెక్కును మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కలెక్టర్ అంబేడ్కర్‌కు అందజేశారు.



రూ.లక్ష చెక్కు అందిస్తున్న మంత్రి కొండపల్లి, ఎమ్మెల్యే అదితి



సాలూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలోని జ్ఞాన సరస్వతి అమ్మవారికి పట్టణానికి చెందిన కోట నాగరాజు, గవర రాజు కుటుంబ సభ్యులు రూ.1.30 లక్షల బంగారు శతమానాలు బహూకరించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, కమిటీ సభ్యులకు అందజేశారు.

– న్యూస్‌టుడే, మక్కువ, సాలూరు గ్రామీణం

పాముకాటుతో వృద్ధుడి మృత్యువాత


దుర్గారావు (పాతచిత్రం)

రేగిడి, న్యూస్‌టుడే: పాముకాటుకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన రేగిడి మండలంలోని నాయురాలవలసలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆర్.దుర్గారావు(62) ఈ నెల 8న సాయంత్రం పొలానికి వెళ్లి తిరిగి వస్తుండగా పాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు రాజాంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి అక్కడి నుంచి శ్రీకాకుళం తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మరణించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నీలావతి తెలిపారు. ఆయన భార్య, వివాహమైన ముగ్గురు పిల్లలున్నారు.

రైలు ఢీకొని 40 గొర్రెల మృతి

కొత్తవలస, న్యూస్‌టుడే: కొత్తవలస- పెందుర్తి సెక్షన్ల మధ్య మంగళవారం సాయంత్రం రైలు ఢీకొని చింతలపాలేనికి చెందిన 40 గొర్రెలు మృత్యువాత పడ్డాయని సర్పంచి సీతారామపాత్రుడు బుధవారం తెలిపారు. పట్టాలు దాటించే సమయంలో రైలు రావడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని చెప్పారు. పెంపకందారులు ఎం.కృష్ణ, రాజు, గణేష్‌కు చెందిన జీవాలు మృతి చెందడంతో పాటు కొన్ని తీవ్ర గాయాలపాలయ్యాయన్నారు. విషయం తెలుసుకుని దెందేరు పశు వైద్య కేంద్రం సిబ్బంది వెళ్లి వాటికి చికిత్స చేశారు. బాధితులను ఆదుకోవాలని సర్పంచి కోరారు.

కడుపునొప్పి తాళలేక వివాహిత బలవన్మరణం

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన గంట్యాడ మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సాయికృష్ణ వివరాల మేరకు.. పెదవేమలికి చెందిన వి.కుమారి(35) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. పలుమార్లు వైద్యులను సంప్రదించినప్పటికీ ఫలితం లేకపోయింది. మంగళవారం తీవ్రమైన కడుపునొప్పి రావడంతో భరించలేని ఆమె ఇంట్లోనే గడ్డిమందును తాగి అపస్మారకస్థితికి చేరుకుంది. గుర్తించిన కుటుంబీకులు విజయనగరంలోని మహారాజా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమెకు భర్త, ఇద్దరు కుమార్తెలున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళతో అసభ్యకర ప్రవర్తన

దేహశుద్ధి చేసిన బాధితురాలు

రాజాం, న్యూస్‌టుడే: తనతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి మహిళ దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన బుధవారం రాజాంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రాజాం పట్టణంలోని అన్న క్యాంటీన్ వద్ద భోజనం చేసేందుకు బుధవారం ఓ మహిళ వచ్చారు. ఆమె పట్ల ఓ వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించడంతో కోపోద్రిక్తురాలై అతన్ని దేహశుద్ధి చేశారు. స్వయంగా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించారు. ఇలాంటి కీచకులకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈమె దారి పొడవునా కొట్టుకుంటూ తీసుకెళ్లడంతో పలువురు స్థానికులు ఆమెకు మద్దతుగా నిలిచారు.

మెట్టపల్లిలో బంగారం చోరీ

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చీపురుపల్లి మండలం మెట్టపల్లి గ్రామంలోని ఓ ఇంట్లో మంగళవారం బంగారం చోరీకి గురైన ఘటనపై బాధితులు బుధవారం పోలీసులను ఆశ్రయించారు. ఎస్సై దామోదరరావు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శేషపు కృష్ణ తన భార్య జయమ్మతో కలిసి గ్రామ సమీపంలోని శివాలయం వద్దకు మొక్కజొన్నలు తెచ్చేందుకు వెళ్లారు. వ్యవసాయ పనుల సామగ్రి కోసం వెళ్లిన అరగంటలోనే జయమ్మ ఇంటికి రాగా.. అప్పటికే తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి.. లోపలికి వెళ్లి చూశారు. ఏడు తులాల బంగారు పుస్తెలతాడు, హారం కనిపించకపోవడంతో భర్తకు సమాచారమిచ్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. క్లూస్‌టీమ్ సభ్యులు వచ్చి ఆధారాలు సేకరించారు.

ఆరు నెలల్లో 110 అగ్నిమాపక వాహనాలు


దస్త్రాలు పరిశీలిస్తున్న ఏడీ శ్రీనివాసులు

కొత్తవలస, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అగ్నిమాపక సేవల ఆధునికీకరణలో భాగంగా కొత్తగా 110 వాహనాలు కొనుగోలు చేయనున్నట్లు ఉత్తర ప్రాంత అగ్నిమాపక సేవలు అదనపు సంచాలకుడు జి.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం కొత్తవలసలోని కేంద్రాన్ని పరిశీలించారు. 15 ఏళ్లు దాటిన వాహనాలు అధికంగా ఉన్నాయని, 15వ ఆర్థిక సంఘం నుంచి కేటాయించిన రూ.252 కోట్లతో కొత్తవి కొనుగోలు చేస్తామన్నారు. సెంట్రలైజ్డ్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా 112కు ఫోన్ చేస్తే జీపీఎస్ ఆధారంగా ఆ కేంద్రానికి సమాచారం వెళ్తుందన్నారు. పరిశ్రమల్లో మంటలను ఆర్పేందుకు డ్రోన్లు, రోబోలను వినియోగించనున్నామన్నారు. ఖాళీగా ఉన్న 30 శాతం ఉద్యోగాల భర్తీకి ఇప్పటికే ప్రిలిమినరీ పరీక్ష పూర్తయిందని చెప్పారు. విశాఖపట్నం ఆర్ఎఫ్‌వో డి.నిరంజన్‌రెడ్డి, విజయనగరం డీడీఆర్ఎఫ్‌వో రామ్ ప్రకాశ్, ఏడీఎఫ్‌వో సోమేశ్వరరావు, కొత్తవలస ఎస్ఎఫ్‌వో వై.అశోక్ కుమార్ పాల్గొన్నారు.

విజయవాడ-శ్రీకాకుళం రోడ్ ప్రత్యేక రైలు

విజయవాడ(రైల్వేస్టేషన్): దసరా దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడ- శ్రీకాకుళం రోడ్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు తెలిపారు. నంబరు 07215 ప్రత్యేక రైలు ఈ నెల 10, 11, 12, 14, 15, 16, 17వ తేదీల్లో విజయవాడలో రాత్రి 8 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.30కి శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో 10, 11, 12, 13, 15, 16, 17, 18వ తేదీల్లో శ్రీకాకుళం రోడ్‌లో ఉదయం 6.30కి బయలుదేరి సాయంత్రం 4 గంటలకు విజయవాడ వస్తుందన్నారు. ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమహేంద్రవరం, ద్వారపూడి, అనపర్తి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు స్టేషన్లలో ఆగుతుందన్నారు.

పక్కాగా వ్యాపార రిజిస్ట్రేషన్లు

'న్యూస్‌టుడే'తో వాణిజ్య పన్నులశాఖ జేసీ



– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

వాణిజ్యపన్నుల శాఖ విజయనగరం డివిజన్ పరిధిలో వ్యాపార, వాణిజ్య సంస్థ బోగస్ రిజిస్ట్రేషన్లు అరికట్టేందుకు జీఎస్టీ సేవా కేంద్రాలు పక్కాగా పనిచేస్తున్నాయని సంయుక్త కమిషనర్ బి.నాగార్జునరావు తెలిపారు. 18, 28 శాతం జీఎస్టీ కలిగిన వస్తువుల క్రయవిక్రయాలపై దృష్టిసారించామని చెప్పారు. ఎప్పటికప్పుడు వాహన తనిఖీలు, ఆడిట్‌లు నిర్వహిస్తున్నామని, కచ్చితమైన సమాచారం ఉంటేనే అనుమతులు ఇస్తున్నామని పేర్కొన్నారు. సకాలంలో రిటర్నులు దాఖలయ్యేలా చూస్తున్నామని వెల్లడించారు. లక్ష్యాలు, ఆదాయ వృద్ధి, ఉద్యోగుల బదిలీలు తదితర అంశాలపై ఆయన 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో మాట్లాడారు.

ముఖాముఖి

1121 దరఖాస్తులు..

జీఎస్టీ సేవా కేంద్రం ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటివరకు 1121 దరఖాస్తులు వచ్చాయి. 670 మందికి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేశాం. 17 తిరస్కరించగా, మిగిలినవి పరిశీలనలో ఉన్నాయి. కొన్నేళ్లుగా బోగస్ సంస్థలు ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే దేశవ్యాప్తంగా తనిఖీలు జరిగాయి. స్థానికంగా 21 సంస్థల వివరాలను పరిశీలించాం.

వాహన తనిఖీలకు 10 పాయింట్లు

డివిజన్ పరిధిలో విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలు ఉన్నాయి. ఈ మూడు ప్రాంతాల్లో 10 వరకు వాహన తనిఖీ పాయింట్లు ఉన్నాయి. సహాయ, సహాయ డిప్యూటీ కమిషనర్లు తనిఖీల ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. దసరా నేపథ్యంలో ముమ్మరం చేస్తున్నారు. వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా ముందుకెళుతున్నాం. సాధారణ సరకు పేరుతో జీఎస్టీ పరిధిలో ఉన్న సరకును రవాణా చేస్తే భారీ మొత్తంలో అపరాధ రుసుం విధిస్తాం.

ఆలస్యమైతే.. రుసుం, వడ్డీ..

జీఎస్టీ వ్యాపారులు ప్రతినెలా 20లోపు రిటర్నులు దాఖలు చేయాలి. లేకుంటే మరుసటి రోజు నుంచి ఆలస్యపు రుసుము, వడ్డీ పడుతుంది. డివిజన్ పరిధిలో 17 వేల మంది జీఎస్టీ డీలర్లున్నారు. వారిని ఇప్పటికే అప్రమత్తం చేశాం. మా సిబ్బందితో అవగాహన సైతం కల్పిస్తున్నాం.

బిల్లు తప్పనిసరి

రూ.200 నుంచి ఏ సరకు కొన్నా బిల్లు ఇవ్వాల్సిందే. అంతకంటే తక్కువ కొంటే అంతకంటే వినియోగదారుడి కోరిక మేరకు తప్పనిసరిగా ఇవ్వాలి. ఈ విధంగా చేసినప్పుడే లావాదేవీల నమోదు ప్రక్రియ సక్రమంగా జరుగుతుంది. ఈ ఆర్థిక ఏడాదిలో రూ.986 కోట్ల వసూళ్ల లక్ష్యం కాగా.. ఇప్పటివరకు రూ.360 కోట్లు వచ్చాయి. ఇతర ఆదాయ మార్గాలపై దృష్టిసారించాం.

భూముల అక్రమ రిజిస్ట్రేషన్

వీఆర్వోపై బాధితుల ఫిర్యాదు

భోగాపురం, న్యూస్‌టుడే: భోగాపురం పంచాయతీకి చెందిన వీఆర్వో రామునాయుడుపై పలువురు బాధితులు బుధవారం తహసీల్దారు సురేష్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఇదే మండలంలోని పోలిపల్లి గ్రామానికి చెందిన కర్రోతు శ్రీనివాసరావుకు సంబంధించిన 50 సెంట్ల భూమి తన సాగు హక్కులో ఉండగా, వేరే వ్యక్తుల పేరున, ఇదే ప్రాంతంలో ఓ రైతు పేరున ఉన్న 10 సెంట్ల భూమి వేరే వ్యక్తుల పేరుతో ఆన్‌లైన్ చేశారని ఆరోపించారు. ఈయనతో పాటు భోగాపురానికి చెందిన వైద్యశాఖలో పనిచేస్తున్న కె.దుర్గారావు అనే వ్యక్తి తన భూమిని మ్యుటేషన్ చేయించేందుకు గతేడాది రూ.5 వేలు ఆయనకు ముట్టజెప్పారని, ఇంకా డిమాండు చేయడంతో ఆ పని ముందుకు కదలలేదన్నారు. ఇలా చాలామంది బాధితులు ఉన్నారని, సంబంధిత వీఆర్వోపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారంతా తహసీల్దారు ముందు వాపోయారు. దీనిపై 'న్యూస్‌టుడే' తహసీల్దారును వివరణ కోరగా రెవెన్యూ పనుల కోసం ఎవరికీ డబ్బులివ్వాల్సిన పనిలేదన్నారు. రెండ్రోజుల కిందటే ఆయన వేరే ప్రాంతానికి బదిలీపై వెళ్లారని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సకాలంలో నిత్యావసరాల పంపిణీ


సరకును పరిశీలిస్తున్న డీఎం మహేంద్రకుమార్

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: పార్వతీపురం డివిజన్ పరిధిలో ఈ ఏడాది వ్యాపార లావాదేవీల లక్ష్యం రూ.61.85 కోట్లుగా నిర్దేశించుకున్నట్లు డీఎం మహేంద్రకుమార్ తెలిపారు. బుధవారం ఎల్విన్‌పేటలోని నిత్యావసర సరకుల గోదామును సందర్శించారు. నాణ్యత, దస్త్రాలు, డిపోలకు సరఫరా అయిన సరకులు, మిగులు నిల్వలు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిపోలు, గోదాముల నిర్మాణానికి రూ.4.10 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని చెప్పారు. సేల్స్‌మెన్లు సమయపాలన పాటించి సకాలంలో నిత్యావసరాలను పంపిణీ చేయాలని ఆదేశించారు. సూపరింటెండెంట్ సాంబశివరావు ఉన్నారు.

ఓపీ కావాలంటే.. చరవాణి ఉండాలట!!

విజయనగరంలోని ప్రభుత్వాసుపత్రిలో ఓపీ విభాగమిది. ఓ వైపు కౌంటర్లన్నీ ఖాళీగా ఉన్నా.. రోగులు మాత్రం చరవాణులతో వరుసలో నిలబడ్డారు. ఇదేంటి విచిత్రంగా ఉందనుకుంటున్నారా.. కొన్ని రోజులుగా నడుస్తున్న తంతు ఇదే. గతంలో కన్నా రద్దీ పెరగడంతో ప్రత్యామ్నాయంగా చరవాణి ద్వారా ఓపీ రిజిస్ట్రేషన్ చేయించుకునే వెసులుబాటు కల్పించారు. రద్దీ ఉన్నప్పుడు మాత్రమే ఈ సేవలని పేర్కొన్నారు. కానీ కౌంటర్లన్నీ ఖాళీగా ఉన్నప్పటికీ సిబ్బంది మాత్రం.. రిజిస్ట్రేషన్ చేసుకునే రావాలని చెప్పడంతో రోజూ ఇలా వరుస కడుతున్నారు. ఈక్రమంలో నిరక్షరాస్యులు, వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలామంది చరవాణుల్లేక వెనక్కి వెళ్లిపోతున్నారు. దీనిపై సూపరింటెండెంటు అప్పలనాయుడును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. ఖాళీగా ఉన్నప్పుడు నేరుగా ఓపీ చీటీ ఇవ్వాలని ఆదేశిస్తామన్నారు. – న్యూస్‌టుడే, విజయనగరం వైద్యవిభాగం


ఖాళీగా ఓపీ విభాగం.. ముందు చరవాణులతో రోగులు

వనరుల సమీకరణతో సమస్యల పరిష్కారం


పుర అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: పురపాలక సంఘం ఆదాయ వనరుల సమీకరణతో ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే బి.విజయచంద్ర అన్నారు. బుధవారం కమిషనర్ ఛాంబర్‌లో అధికారులు, ఉద్యోగులతో సమీక్షించారు. పురపాలక ఆర్థిక పరిస్థితులు మెరుగుకు ప్రణాళికతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలను నుంచి బకాయిలు రూ.కోట్లలో ఉన్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తాగునీటి సమస్యపై నిరంతరం పర్యవేక్షించి ప్రజలకు సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఆర్థిక భారం పడకూడదనే ఉద్దేశంతో చెత్తపన్ను రద్దు చేసిందన్నారు. ఇన్‌చార్జి కమిషనర్ సన్యాసిరావు, ప్రణాళికాధికారి జి.లక్ష్మి, ఆర్వో రాబిన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తుల వివరాలపై ఆరా

బలిజిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పెదపెంకిలో ఫైలేరియా రోగుల వివరాలు, పారిశుద్ధ్య సమస్యలపై జిల్లా మలేరియా అధికారిణి వై.మణి ఆరా తీశారు. 'పెదపెంకిలో ప్రతి వీధిలోనూ సమస్యలే' అన్న శీర్షిక 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన జిల్లా మలేరియా అధికారిణి మణి గ్రామంలో పర్యటించారు. అనంతరం వైద్యసిబ్బందితో సమావేశమై సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఈమెతో సబ్‌యూనిట్ అధికారి ఎం.ఈశ్వరరావు, ఎంపీహెచ్ కర్ల, ఆరోగ్య కార్యకర్తలు ఉమామహేశ్వరరావు, గౌరి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారిణి మణి

వరి సాగులో మెలకువలు

సీతానగరం, పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: వరి సాగులో రైతులు మెలకువలు పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు భారతి సూచించారు. బుధవారం రంగంపేటలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వరి పైరును పరిశీలించి ఆమె తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ● ఖరీఫ్ వరి చేలలో దోమ తెగులును రైతులు గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాలని పార్వతీపురం ఏవో ఆశోక్ సూచించారు. మండలంలోని వెంకంపేటలో రైతులతో వరి సాగులో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సర్పంచి కృష్ణారావు, రైతులు రవికుమార్, మాదవ, ధనుంజయ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఏడీఏ భారతి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

పార్వతీపురం	-8008566244
పాలకొండ	-8008574299
సాలూరు	-8008786820
కురుపాం	-9849044696

? పాలకొండ కస్పావీధి కూడలిలో రక్షిత పైపు దెబ్బతింది. - రమణమూర్తి

● పైపులను మరమ్మతులు చేసి రక్షితనీరు వృథాను అరికడతాం. - దేవీవరప్రసాద్, ఏఈ
- న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

? సూరంపేటలో విద్యుత్తు నియంత్రిక చుట్టూ లతలు అల్లుకుపోవడంతో సరఫరాకు అంతరాయం కలుగుతుంది. - రాంబాబు

● నియంత్రిక చుట్టూ ఉన్న లతలను తొలగిస్తాం. - జగన్‌మోహనరావు, ఏఈ
- న్యూస్‌టుడే, సీతానగరం

? నందమూరి కాలనీలో కాలువల్లోని మురుగు రోడ్లపై పారుతోంది. -కామినాయుడు

● పరిశీలించి కాలువల్లో పూడికలు తీయిస్తాం. - కనకరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్
- న్యూస్‌టుడే, బెలగాం

? బంగారమ్మ కాలనీలో తాగునీటి పైపులైను లీకవడంతో రోడ్లపై వృథాగా పారుతోంది. - గొల్లు వెంకట్రావు

● సమస్యను గుర్తించి, చర్యలు చేపట్టి లీకులను అరికడతాం. - జి.ఆనంద్, ఏఈ
–న్యూస్‌టుడే, బెలగాం

శిథిల వారధులు.. ప్రయాణికుల హడలు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ నియోజకవర్గం పరిధిలోని వంతెనలు పలుచోట్ల ప్రమాదకరంగా మారాయి. దశాబ్దాల క్రితం నిర్మాణాలు చేపట్టడం, నిర్వహణ కొరవడడంతో శిథిలావస్థకు చేరాయి. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు పోతులగెడ్డ, ఒట్టిగెడ్డపై నిర్మించిన వారధులు పలుచోట్ల బలహీనంగా మారాయి. అధికారులు ఆదిలోనే మేల్కొనకుంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని పలువురు విమర్శిస్తున్నారు.


రాజుపేట కూడలి సమీపంలో దెబ్బతిన్న మినీ వంతెన

కానరాని పనులు..

వంతెనల వద్ద ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు తరచూ నిర్వహణ పనులు చేపట్టాలి. వంతెనలకు ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగించాలి. ఈ పరిస్థితి లేకపోవడంతో పలుచోట్ల వంతెనల పిల్లర్లపై మొక్కలు మొలుస్తున్నాయి. ఇవి క్రమంగా భారీ వృక్షాలుగా మారి వేళ్లు బలంగా చొచ్చుకుపోతుండడంతో పిల్లర్లు బలహీనంగా మారుతున్నాయి. దీంతో భారీ వర్షాలకు వంతెనలు కుంగుతున్నాయి.

దశాబ్దాల నాటి కట్టడాలు..

పాలకొండ-వీరఘట్టం రహదారిలో ఆంగ్లేయుల కాలంలో నిర్మించిన వంతెనలు బలహీనంగా మారాయి. మండలం పరిధిలోని రాజుపేట కూడలి, జంపరకోట వద్ద ఉన్న వారధులు ప్రమాదకరంగా ఉన్నాయి. పోతులగెడ్డపై ఉన్న వంతెన 10ఏళ్ల క్రితం నిర్మించినప్పటికి ఇరువైపుల రక్షణగోడలు విరిగిపోయాయి. వీరఘట్టం మండలంలోని చిదిమి కూడలిలో కూడా మరమ్మతులకు గురయింది. వీరఘట్టం-పార్వతీపురం రహదారిలో ఉన్న ఒట్టిగెడ్డ, గజాలఖానా, పాలకొండ-విజయనగరం మార్గంలో చినమంగళాపురం కూడలిలోని పెద్ద వంతెనపై గుంతలు ఏర్పడ్డాయి. విశాఖ వెళ్లే మార్గంలో గోపాలపురం వద్ద కల్వర్టు, వారధులు బలహీనంగా ఉన్నాయి.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

నియోజకవర్గ పరిధిలోని వంతెనల పరిస్థితి ఆర్‌అండ్‌బీ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పాలకొండ-వీరఘట్టం రహదారి వంతెనలకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాల్సి ఉంది అని ఎమ్మెల్యే జయకృష్ణ పేర్కొన్నారు.

భారీ వాహనాలతో తీవ్ర నష్టం..

విజయనగరం జిల్లా బొబ్బిలి సమీపంలో ఉన్న పారాది వంతెన బలహీనంగా మారడంతో విశాఖ వైపు వెళ్లాల్సిన భారీ వాహనాలు పాలకొండ మీదుగా మళ్లించారు. జాతీయ రహదారులపై ప్రయాణించాల్సిన వాహనాలు పాలకొండ-పార్వతీపురం మార్గంలో రాకపోకలు సాగిస్తుండటంతో వంతెనలు దెబ్బతింటున్నాయి. పాలకొండ-వీరఘట్టం రహదారిలోని మూడు చిన్నవంతెనలు పాడయ్యాయి. వంతెనలు పూర్తిగా దెబ్బతింటే ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉంది. గత కొన్ని సంవత్సరాలుగా రహదారులు, భవనాల శాఖ చేపట్టాల్సిన నిర్వహణ పనులు పోలీసులు చేపడుతున్నారు.


గజాల ఖాన వంతెనపై గుంతలు..

పాఠశాల పునరుద్ధరించరూ..

పార్వతీపురం గ్రామీణం: మండలంలోని పెదబొండపల్లి పంచాయతీ శివారు గడబవలసలో ప్రాథమిక పాఠశాలను పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఇక్కడి పక్కా భవనంలో కొనసాగుతున్న పాఠశాలను హేతుబద్ధీకరణలో మూసేశారు. ఇక్కడి నుంచి మూడు కి.మీ. దూరంలో పంచాయతీ కేంద్రంలో పాఠశాలలున్నాయి. ప్రస్తుతం 12 మంది విద్యార్థులు అక్కడ పాఠశాలకు వెళ్లి చదువుతున్నారు. తరగతులు నిలిపేసిన తరువాత భవనం, ప్రాంగణం మొక్కలు మొలిచి పాడవుతోంది. కొన్ని గ్రామాల్లో నలుగురైదుగురు విద్యార్థులతో తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడి భవనం పాడవకముందే తరగతులు పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై ఎంఈవో విమల కుమారి మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.


గడబవలసలో పాడవుతున్న పాఠశాల భవనం

పంచ శైవక్షేత్ర దర్శనానికి ప్రత్యేక బస్సులు

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోని శైవక్షేత్రాలు దర్శించుకోవడానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు పార్వతీపురం డిపో మేనేజర్ దుర్గ తెలిపారు. జిల్లా పరిధిలోని గుణ సోమేశ్వరాలయం, అడ్డపుశిల కాశీవిశ్వేశ్వర స్వామి, నారాయణపురం నీలకంఠేశ్వరస్వామి, సంగం సంగమేశ్వర స్వామి, తోటపల్లిలోని ఆలయాలకు ఒక్క రోజులోనే భక్తులు దర్శించుకునేలా ప్రణాళిక తయారు చేశామన్నారు. నవంబరు 4, 11, 18, 25 తేదీల్లో బస్సు సర్వీసులు నడుస్తాయని వెల్లడించారు. బస్సు బుక్ చేసుకునే అవకాశం ఉందన్నారు. apsrtconline.in వెబ్‌సైట్ ద్వారా, గుర్తింపు పొందిన ఏజెంట్ల ద్వారా రిజర్వేషన్ చేసుకునే అవకాశం ఉందన్నారు.

మూలకు చేరిన జనరేటర్



వీరఘట్టం మండలం తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో జనరేటర్ నిరుపయోగంగా మారింది. విద్యుత్తు సరఫరా నిలిచిన సమయంలో సేవలకు అంతరాయం కలగకుండా కొనసాగించేందుకు అందుబాటులోకి ఉంచారు. కానీ, జనరేటర్‌పై అధికారుల దృష్టికొరవడంతో వర్షాలకు తడుస్తూ, ఎండకు ఎండుతూ తుప్పుపట్టి పూర్తిగా పాడైపోయింది. యంత్రాన్ని వినియోగంలోకి తీసుకొస్తే అత్యవసరాల సమయంలో ఇబ్బందులు ఉండవడని పలువురు చెబుతున్నారు. దీనిపై తహసీల్దారు సత్యనారాయణ మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.
– న్యూస్‌టుడే, వీరఘట్టం

తవ్వారు.. వదిలేశారు

పార్వతీపురం పట్టణంలోని కొత్తవలస కొత్తపోలమ్మ కాలనీలో కాలువలపై పలకలు తొలగించడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలనీల్లో పలు వీధుల్లో పూడికలు తొలగించేందుకు కల్వర్టు, కాలువలపై పలకలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. పూడిక తీత అనంతరం వాటిని అమర్చకుండా అలా వదిలేయడంతో ఆయా వీధుల్లోకి రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వెంటనే పలకలను అమర్చాలని స్థానికులు కోరుతున్నారు.



– న్యూస్‌టుడే, బెలగాం

ప్రారంభానికి ముందే శిథిలం చేస్తారా!



పాలకొండ పట్టణంలోని అర్బన్ హెల్త్‌సెంటర్ ఇది. నాలుగేళ్ల కిందట ప్రారంభించిన భవనం నేటికీ పూర్తికాలేదు. నిధుల సమస్య కారణంగా నిర్మాణం మధ్యలోనే నిలిచిపోవడంతో శిథిలావస్థకు చేరుతుంది. పైకప్పుపై వర్షం నీరు నిలిచి పూర్తిగా పాడవుతోంది. మరోవైపు చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు భవనంపైకి చేరి రూపు మారుతోంది. రూ.80 లక్షల అంచనా వ్యయంతో ప్రారంభించిన భవనానికి ఇప్పటికే రూ.55 లక్షల మేర నిధులు వ్యయం చేశారు. నిధులు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు తెలిపారు. – న్యూస్‌టుడే, పాలకొండ

శుభ్రం చేసేవారే కరవు

కురుపాం పంచాయతీ ప్రధాన రక్షిత తాగునీటి పథకం నుంచి పూర్తిస్థాయిలో నీరు రావడం లేదు. దీంతో దూరప్రాంతాల్లోని ప్రజలు సేద్యపు బావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. ఆఖరుకు ట్యాంకును శుభ్రం చేసేవారే కరవయ్యారు. వీధుల్లోకి వచ్చే తాగునీటి పైపులైన్లకు అక్కడక్కడ లీకేజీ ఉండటంతో తాగునీరు కలుషితమవుతోందని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నా.. నేటికి పరిష్కారం చూపించడం లేదు. ట్యాంకు శిథిలావస్థకు చేరిందని, నూతన పథకానికి రూ.1.80 కోట్లు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఆర్.వేణు తెలిపారు.



– న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

భారీ వాహనాలతో పాడవుతున్న రహదారులు

పార్వతీపురం నుంచి జిల్లేడువలస మీదుగా ఒడిశా (నారాయణ పట్నా) వైపు భారీ వాహనాలు తిరగడంతో రోడ్డు పాడవుతోందని అడారు సర్పంచి దిబ్బన్న, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా వేసిన రోడ్డు రెండేళ్లు పూర్తి కాక ముందే గోతులు పడడంతో అందులో కర్ర జెండాలు పెట్టి రాళ్లు వేసి హెచ్చరికలు చేస్తున్నామని వాపోయారు. పీఆర్ అధికారులకు పరిస్థితిని వివరిస్తూ రోడ్డు బాగుచేసి, భారీ వాహనాలు వెళ్లకుండా చూడాలని కోరామన్నారు. పరిస్థితి ఉన్నతాధికారులకు వివరించి, తదుపరి చర్యలు తీసుకుంటామని పీఆర్ ప్రాజెక్టు జేఈ శ్రీనివాస్ తెలిపారు.



– న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

అతిథి అధ్యాపకునికి దరఖాస్తులు

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ పరిధిలోని భామిని ఏకలవ్య పాఠశాలలో తాత్కాలిక పద్ధతిపై పీజీటీ రసాయన శాస్త్రం అతిథి అధ్యాపకుడిగా విధులు నిర్వర్తించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా పాలనాధికారి ఎ.శ్యామ్ ప్రసాదు, ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ నెల 19లోపు కొత్తూరు పీఎంహెచ్, సీతంపేట ఐటీడీఏలోని గురుకులంలో వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

బోధకుని నియామకానికి ఆహ్వానం

పార్వతీపురం, న్యూస్‌టుడే: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని అసనభద్ర ఏకలవ్య పాఠశాలలో తెలుగు టీజీటీగా తాత్కాలిక ప్రాతిపదికన నియామకానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ బుధవారం ప్రకటనలో తెలిపారు. తెలుగు టీజీటీగా పనిచేయడానికి నిర్దేశించిన అర్హత ఉన్న వారు 17లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నట్టల నివారణకు టీకాలు

వీరఘట్టం, న్యూస్‌టుడే: గొర్రెలు, మేకలకు బుధవారం నుంచి ఈ నెల 25 వరకు నట్టల నివారణకు టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారి పి.చైతన్యశంకర్ తెలిపారు. మండలంలోని 34,000 జీవాలు ఉన్నాయని మూగజీవాలకు ప్రాణాంతక వ్యాధులు సంక్రమించకుండా జాగ్రత్తలు వహించాలని చెప్పారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం రేపు

పార్వతీపురం పురపాలక: బెలగాం ప్రాంతంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ మురళీధర్ తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి వైకేఎం వరకు సరఫరా అంతరాయం కలుగుతుందన్నారు.

ప్రతి చిన్నారికి వ్యాధి నిరోధక టీకా

పార్వతీపురం పట్టణం: ప్రతి చిన్నారికి వ్యాధి నిరోధక టీకా వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐవో) నారాయణ ఆదేశించారు. బుధవారం బెలగాంలోని 15వ వార్డులో వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లల బరువు, ఎత్తు నమోదు దస్త్రాలను చూశారు. సూపర్‌వైజర్ జయగౌడ్, ఏఎన్ఎం నారాయణమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న అధికారి నారాయణ

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: పంచాయతీరాజ్ పాలన వ్యవస్థపై ఉప సర్పంచులకు, వార్డు సభ్యులకు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌పీవో జె.రాంప్రసాద్ రావు అన్నారు. బుధవారం కురుపాం వెలుగు కార్యాలయంలో ఎంపీడీవో జె.ఉమమహేశ్వరి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ శెట్టి పద్మావతి, జడ్పీటీసీ సభ్యురాలు సుజాత, జి.రమేష్ బాబు, 23 పంచాయతీల ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎల్‌పీవో రాంప్రసాద్‌రావు

అంతర్జాతీయ పోటీలకు ఎంపిక

మక్కువ: సాలూరు మండలం ఎం.మామిడిపల్లికి చెందిన కనకల పైడిరాజు అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 10 నుంచి 19 వరకు మలేసియాలో జరగబోయే అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని శిక్షకుడు పి.శ్రీరాములు తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి 200, 400, 800 మీటర్ల పోటీల్లో పైడిరాజు స్వర్ణం సాధించారు.


పైడిరాజు

దూషణపై విచారణ

వీరఘట్టం: మండలంలోని బిటివాడలో నమోదైన అట్రాసిటీ కేసుపై పాలకొండ డీఎస్పీ ఆర్.రాంబాబు బుధవారం విచారణ చేపట్టారు. నిద్రపోతున్న సమయంలో తలుపులు పగులగొట్టి తన ఇంటిలోకి చొరబడిన ఎం.హరి, ఎం.భాను తనను గాయపరిచారని ఎస్.యోగిందొర పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దాడి ఘటనపై కేసు నమోదు

పాలకొండ: పట్టణంలోని గారమ్మకాలనీలో నివాసముంటున్న ఒడిశాకు చెందిన సమరేంద్ర కుమార్‌శెట్టిపై దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రయోగమూర్తి తెలిపారు. తపాలా శాఖలో పనిచేస్తున్న ఆయనపై మంగళవారం రాత్రి కొందరు వ్యక్తులు దాడి చేశారు.

మత్స్యకార సంఘం ఎన్నిక

సాలూరు గ్రామీణం, మక్కువ: శ్రీ పోలమాంబ స్వదేశీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా తాతపూడి సత్యనారాయణ, కార్యదర్శిగా బి.శివుడు ఎన్నికయ్యారు.

పాచిపెంట ఎంపీడీవోగా పాత్రో

పాచిపెంట: పాచిపెంట ఎంపీడీవోగా బీవీజే పాత్రో బుధవారం విధుల్లో చేరారు. పరిపాలన అధికారిగా పనిచేసిన ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఉప తహసీల్దారుగా జి.చంద్రశేఖర్ విధుల్లో చేరారు.


బంజ్‌దేవ్‌ను సత్కరిస్తున్న జనసేన నాయకులు


అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దాం..

సాలూరు గ్రామీణం, మక్కువ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దామని మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ బంజ్‌దేవ్ అన్నారు. బుధవారం సాలూరు పట్టణంలో ఇటీవల వైకాపా నుంచి జనసేన పార్టీలో చేరిన సూరిబాబు, ఈశ్వరరావు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఒకరికి తీవ్ర గాయాలు

రామభద్రపురం: పాచిపెంటకు చెందిన మహేష్ ద్విచక్ర వాహనంపై రామభద్రపురం వెళ్తుండగా కొట్టక్కి రహదారిపై కారు ఢీ కొనడంతో తలకు తీవ్ర గాయమైంది. బంధువులు విశాఖలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.


నమస్తేస్తు వీణాపాణి


పార్వతీపురం వేమకోటివారి వీధిలో సరస్వతీ దేవి అలంకరణలో దుర్గమ్మ


సీతంపేట సంతోషిమాత ఆలయంలో పుస్తక పూజలో విద్యార్థులు


పాలకొండలో హంస వాహనంపై జ్ఞానసరస్వతి

దేవీ శరన్నవరాత్రుల్లో ఏడోరోజు బుధవారం మూలా నక్షత్రం సందర్భంగా జగజ్జనని చదువులతల్లి సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. అన్ని ఆలయాల్లోనూ అక్షరాభ్యాసాలు కొనసాగాయి. విద్యాబుద్ధులు ప్రసాదించాలని వీణపాణికి విద్యార్థులు పూజలు చేశారు. పార్వతీపురం బెలగాంలోని బంగారమ్మ కాలనీలో ఎమ్మెల్యే విజయచంద్ర అమ్మవారిని దర్శించుకుని, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రధాన రహదారిలోని కళింగ వైశ్య కన్యకాపరమేశ్వరి అమ్మవారు సరస్వతీ రూపంలో దర్శనమిచ్చారు. పాలకొండ, సాలూరు, జీఎల్‌పురం, జియ్యమ్మవలస, కురుపాం, కొమరాడ, సీతంపేట, బలిజిపేటలో చదువుల తల్లిని విద్యార్థులు ప్రణమిల్లారు. జీఎల్‌పురంలో మహిళల కోలాటం ఆకట్టుకుంది. –న్యూస్‌టుడే బృందం


సరస్వతీదేవిగా కన్యకా పరమేశ్వరి అమ్మవారు


కురుపాంలో సరస్వతీదేవిగా కోట దుర్గమ్మ


చినమేరంగిలో దుర్గమ్మ


అజ్జాడలో దుర్గాదేవి


బెలగాంలో చిన్నారులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర


జీఎల్‌పురంలో కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

హరిత రాయబారులకు వేతనాలు చెల్లించండి


డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న హరిత రాయబారులు

పార్వతీపురం, కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: జిల్లాలో పంచాయతీల్లో పారిశుద్ధ్య పనుల్లో భాగస్వామ్యులైన హరిత రాయబారుల వేతన బకాయిలు చెల్లించాలని సిటు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు కోరారు. కలెక్టరు కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి కేశవనాయుడుకు వినతిపత్రం సమర్పించారు. ఏడాది కాలంగా వేతనాలు సక్రమంగా చెల్లించట్లేదని వాపోయారు. స్వచ్ఛాంధ్ర మిషన్ పరిధిలో చెల్లింపులు జరిగినప్పుడు సమస్యలు ఎదురవలేదని, పంచాయతీల నిధులనుంచి చెల్లింపులు జరగడట్లేదన్నారు. సిటు నాయకులు వై.మన్మథరావు, జి.సన్యాసిరావు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఆరా

పాచిపెంట, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై కేంద్ర బృందం లబ్ధిదారులకు మాట్లాడారు. మండలంలోని పద్మాపురం, మిర్తివలస గ్రామాల్లో బుధవారం పర్యటించారు. ఉపాధి హామీ, పింఛన్లు, గృహ నిర్మాణం, స్వామిత్వ, జల్‌జీవన్ పథకాలు అమలు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పాచిపెంట నుంచి ఎగువ కుమ్మరివలస వరకు రూ.3.60 కోట్లు ఉపాధి నిధులతో చేపడుతున్న బీటీ రహదారి పనులు పరిశీలించారు. కేంద్ర బృంద సభ్యులు కెజీ సలీమ్ కుమార్, ఎం.కె.శశి అప్తన్‌తోపాటు ఏపీడీ రమేష్, ఎంపీడీవో పాత్రో పాల్గొన్నారు.


వేతనదారులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

62 వేల మొక్కలు నాటేందుకు చర్యలు


సిబ్బందికి సూచనలిస్తున్న గంగరాజు

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: అటవీశాఖ ఆధ్వర్యంలో 25 హెక్టార్లలో 62 వేల టేకు మొక్కలు నాటేందుకు చర్యలు చేపడుతున్నట్లు కురుపాం రేంజ్ అధికారి గంగరాజు తెలిపారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయన బుధవారం గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో పర్యటించారు. ఎల్విన్‌పేట సమీపంలో నాటిన మొక్కలు, అడవులను పరిశీలించారు. అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని, కలప అక్రమ రవాణా జరిగితే చర్యలు తప్పవన్నారు. అక్రమంగా తరలిస్తున్న రూ.1.40 లక్షల విలువల చేసే కలపను ఖడ్గవలస సమీపంలో పట్టుకున్నట్లు చెప్పారు. సెక్షన్ అధికారి సూర్యప్రకాశ్, సిబ్బంది నీలామణి, రామారావు ఉన్నారు.

ఫర్నిచర్ దొంగలపై చర్యలకు డిమాండ్

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సాలూరు పురపాలిక పరిధిలోని శానిటేషన్ సెక్షన్ అతిథి గదిలో 2013లో ఏర్పాటు చేసిన ఫర్నిచర్ దొంగిలించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీ మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల సంఘం, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సాలూరు మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు ఆధ్వర్యంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాజీవ్‌కు వినతి అందించారు. ఫర్నిచర్ దొంగిలించిన ఘటనపై కలెక్టర్, కమిషనర్ దర్యాప్తు చేసి, దోషులను శిక్షించాలన్నారు.


నిరసన తెలుపుతున్న మున్సిపల్ నాయకులు, కార్మికులు

గర్భిణులకు పోషకాహారం పంపిణీ

వీరఘట్టం, న్యూస్‌టుడే: వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శ్రీకాకుళం గురజాడ విద్యాసంస్థలు ఆధ్వర్యంలో గర్భిణులకు బుధవారం పోషకాహారం అందజేశారు. ఆరోగ్య తనిఖీలకు వచ్చిన 55 మంది గర్భిణులకు సంస్థ అధినేత జీవీ స్వామినాయుడు తల్లిదండ్రులు స్వర్గీయ గౌరమ్మ, జగ్గునాయుడు జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం చేపట్టారు. వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్, వీరఘట్టం, చలివేంద్రి భక్తులు పాల్గొన్నారు.


గర్భిణులకు పోషకాహారం అందజేస్తున్న డా.ప్రదీప్‌కుమార్